# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-02-2018** **సమయం : 1.20 గంటలు**

---

1. **ప్రభుత్వోద్యోగులు సాంకేతిక పరాజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ప్రజలకు మరింత చేరువ కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌కు పెద్దఎత్తున పెట్టుబడులను ఆహ్వానించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా విశాఖలో రేపటి నండి మూడు రోజుల పాటు భాగస్వామ్య సదస్సును నిర్వహిస్తున్నాయి.**

3. **వైద్యవిద్యలో ప్రవేశాలు కోరుకునే ప్రవాస భారతీయ అభ్యర్థులు 2018 మే లేదా ఆ తరువాత గానీ జాతీయ ప్రవేశ పరీక్ష – నీట్‌కు అర్హత సాధించవలసి ఉంటుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.**

4. **ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గిరిజన ఉత్పత్తులకు అంతర్జాతీయ విపణిలో మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రముఖ బహుళ జాతి సంస్థ వాల్‌మార్ట్‌తో గిరిజన సహకార సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.**

5. **ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను పంచుకునే 'మన్ కీ బాత్' 41వ సంచిక ఎల్లుండి ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

==========================

ప్రభుత్వోద్యోగులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ప్రజలకు మరింత చేరువ కావాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. సాంకేతికతతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

అమరావతిలోని గ్రీవెన్స్ సెల్‌లో ఈ రోజు నిర్వహించిన ఈ-ప్రగతి శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడుతూ, ప్రజలకు సుపరిపాలన అందించాలంటే సాంకేతికంగా ముందు ఉద్యోగులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ కూడా పాల్గొన్నారు.

-------------------------

సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాలయాలు ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఇకపై ఉమ్మడిగా ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనంద్‌బాబు వెల్లడించారు. ఉమ్మడి పరీక్షకు నోటిఫికేషన్‌ను నిన్న మంత్రి సచివాలయంలో విడుదల చేసి మాట్లాడుతూ, 2018-19 విద్యాసంవత్సరానికిగానూ ఏప్రిల్ 8వ తేదీన ఉమ్మడి పరీక్ష నిర్వహించి జిల్లాను యూనిట్‌గా తీసుకుని, పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఆయా విద్యాలయాల్లో సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్న పరీక్షకు అర్హులైన అభ్యర్థులు వచ్చే నెల 20వతేదీలోగా ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని నక్కా ఆనంద్ బాబు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆహ్వానించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య సంయుక్తంగా విశాఖలో రేపటి నుండి మూడు రోజులపాటు నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 14 దేశాల నుండి వాణిజ్య శాఖ మంత్రులు, 60 దేశాల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా 9 ప్లీనరీ సమావేశాలు, 8 సెక్టోరల్ సమావేశాలు జరగనున్నాయి.

విశాఖ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ప్రముఖ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉంది. ఈ ఏడాది సుమారు 3 లక్షల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు రాబట్టాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఇందుకు సంబంధించి నాలుగు వందల అవగాహన ఒప్పందాలపై సంతకాలు జరగనున్నట్లు తెలుస్తోంది.

కాగా... భాగస్వామ్య సదస్సు కోసం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, రెండున్నర వేలమంది సిబ్బందితో బందోబస్తు ప్రణాళికను అమలు చేస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు.

---------------------------

మొబైల్ ఫోన్ల వినియోగదారులు తమ నెంబర్లను వచ్చేనెల 31వ తేదీ నాటికి ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ తెలిపింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఇప్పటికే మొబైల్ నెంబర్‌తో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ ప్రారంభమైందని పేర్కొంది. మొబైల్ వినియోగదారులు సమీపంలోని ఫ్రాంఛైజ్ లేదా రిటైలర్ వద్ద ఆధార్‌ను అనుసంధానం చేసుకోవచ్చని వివరించింది.

---------------------------

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏడాదికి 75 వేల కోట్ల రూపాయల విలువైన పంటలు పండుతాయని భారతీయ జనతా పార్టీ ఎమ్‌ఎల్‌సి సోము వీర్రాజు పేర్కొన్నారు. ఆయన ఈ రోజు విజయవాడలో విలేకర్లతో మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన, ప్రత్యేక హోదా, ప్యాకేజీ తదితర అంశాలకు సంబంధించిన వాస్తవాల పట్ల ప్రజలకు అవగాహన కలగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చే అంశంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక

హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో ఈ రోజు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మగౌరవ దీక్షలో ఆయన పాల్గొన్నారు.

-------------------------

వైద్య విద్యలో ప్రవేశాలు కోరుకునే ప్రవాస భారతీయ అభ్యర్థులు 2018 మే లేదా ఆ తరువాత గానీ, జాతీయ ప్రవేశ పరీక్ష "నీట్" కు అర్హత సాధించవలసి ఉంటుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఎమ్‌సిఐ నుంచి అర్హత ధృవీకరణ పత్రాలు పొంది ప్రస్తుత నిబంధనల మేరకు ప్రాధమిక వైద్య కోర్సులో ప్రవేశం పొందిన వారిని నీట్ నుంచి మినహాయించినట్లు పేర్కొంది. భారత పౌరులు లేదా విదేశాలలోని భారత పౌరులు విదేశాల్లో ఎమ్.బి.బి.ఎస్. కోర్సులలో ప్రవేశానికి తప్పనిసరిగా నీట్ అర్హత సాధించాలని ఒక అధికార ప్రకటనలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది.

-------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో ఉత్పత్తులకు అంతర్జాతీయ విపణిలో మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ప్రముఖ బహుళజాతి సంస్థ వాల్ మార్ట్‌తో గిరిజన సహకార సంస్థ ఒప్పందం చేసుకుంది. మొదటి విడతగా 10 లక్షల రూపాయల మేరకు గిరిజనోత్పత్తులు... కాఫీ, నన్నారి, బిల్వషర్బత్ ఉత్పత్తులను విక్రయించనున్నది.

జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ ఎ.రవిప్రకాష్ విజయనగరం జిల్లా పార్వతీపురంలో ఈ రోజు విలేకర్లతో మాట్లాడుతూ, జిసిసికి రాష్ట్రంలో 70 నిల్వ కేంద్రాలు ఉన్నాయని, సేకరించిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువచ్చేందుకు 7 పారిశ్రామిక సముదాయాలు నడుస్తున్నాయని చెప్పారు. వచ్చే ఐదేళ్ళలో వాల్ మార్ట్ ద్వారా 10 కోట్ల రూపాయల వరకు అమ్మకాలు జరగవచ్చునని రవిప్రకాష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

-------------------------

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే 'మన్ కీ బాత్' 41వ సంచిక ఎల్లుండి-ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమాన్ని దేశంలోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలు ప్రసారం చేస్తాయి. తిరిగి రాత్రి 8 గంటలకు మరోమారు ప్రధాని ప్రసంగం తెలుగు అనువాదాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి కేంద్రాలు ప్రసారం చేస్తాయి.

-------------------------

శ్రీకాకుళం జిల్లా చారిత్రక వైభవాన్ని నలుదిశలా వ్యాపింపచేయాలనే ఉద్దేశ్యంతో ఈ రోజు నుంచి మూడు రోజుల పాటు జరగనున్న సిక్కోలు సంబరాలలో భాగంగా శ్రీకాకుళంలో ఉదయం స్వచ్ఛ సిక్కోలు ర్యాలీ జరిగింది. జిల్లా కలెక్టర్ కె.ధనంజయ రెడ్డి జెండా ఊపి ప్రారంభించిన ఈ ర్యాలీ శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛ శ్రీకాకుళం కార్యక్రమాల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో పెద్ద ఎత్తున పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నామని చెబుతూ కలెక్టర్

వాయిస్ - 22 సెకన్స్

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 28 నుంచి వచ్చేనెల 19 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఇంటర్ బోర్డ్ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ ఉదయలక్ష్మి తెలిపారు. ఈ రోజు అమరావతిలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఉన్న 1423 పరీక్షా కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసామని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆలస్యంగా వచ్చే విద్యార్థులను పరీక్షా తరగతులలోకి అనుమతించమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వివరాలను ఐపిఇ సెంటర్ లొకేటర్ యాప్ లో తెలుసుకోవచ్చని, విద్యార్థులకు ఏదైనా సమస్య ఉంటే 1800 274 9868 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చెయ్యవచ్చని ఉదయలక్ష్మి తెలిపారు.

--------------------------

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటి అనుబంధ పి.జి.కళాశాలల్లో ప్రవేశానికి వచ్చే మే 5,6,7 తేదీలలో పరీక్ష నిర్వహించనున్నట్లు విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య కె.రాంజీ చెప్పారు. శ్రీకాకుళంలో నిన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరం వరకు ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన ఆ-సెట్ పరీక్ష ద్వారా అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రవేశాలు కల్పించనున్నామని వివరించారు.

======================